
సాక్షి పల్నాడు

బుధవారం । 6 । నవంబర్ । 2024




కార్తిక పూజలు

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో ఉన్న భూసమేత రంగనాయస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక పూజలు నిర్వహించారు. ఉపాలయం వద్ద దీపాలతో అలంకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 586.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,443 క్యూసెక్కులు వదిలారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 7226 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1473 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన



తాళ్ళాయపాలెం (తాడికొండ): ఈ నెల 7వ తేదీన తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం గ్రామంలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులతో చర్చించి పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ... తాళ్ళాయపాలెంలో 7వ తేదీన సీఎం చేతుల మీదుగా 400/200 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం కానుందని తెలిపారు. అనంతరం ఇతర జిల్లాలకు సంబంధించిన అభివృద్ధి పనులకు కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు చేయనున్నారని చెప్పారు. ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఫొటో ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం ప్రారంభించనున్న సబ్‌స్టేషన్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పది పరీక్ష ఫీజు చెల్లింపునకు 18 వరకు అవకాశం

యడ్లపాడు: పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపునకు ప్రభుత్వం గడువుపెంచింది. ఈనెల 18వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. అపరాధ రుసుంతో వచ్చే నెల వరకు చెల్లించుకోవచ్చని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ చంద్రకళ తెలిపారు. ఈనెల 19 నుంచి 25వ తేదీలోగా రూ.50 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చు. 26 నుంచి వచ్చేనెల మూడో తేదీలోగా రూ.200 అపరాధ రుసుంతో వచ్చే నెల నాలుగు నుంచి 10వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చు. చైల్డ్ విత్ స్పెషల్ నీడ్ (సీడబ్ల్యూఎస్ఎన్) విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించనవసరం లేదు. సదరం సర్టిఫికెట్ లేని వారు సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం పంపించిన ఫార్మేట్‌లో సివిల్ సర్జన్‌తో తీసుకున్న ధ్రువీకరణ పత్రం పొందుపరిచే వీలును ప్రభుత్వం కల్పించింది. ఆన్‌లైన్ దరఖాస్తులు www. bre.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పూర్తిచేసిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లోనే సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

పురస్కారానికి పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపిక



నగరంపాలెం: అజో విభో కందాళం ఫౌండేషన్ ప్రతి సంవత్సరం రచయితకు విశిష్ట సాహితీమూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. వచ్చే ఏడాది 2025కిగాను అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను పురస్కారానికి ఎంపిక చేసినట్లు అరసం ఏపీ ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 3, 4, 5వ తేదీల్లో విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరగబోయే సభలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ మెగా లోక్‌అదాలత్

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లెరూరల్: మెగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేకూరేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సబ్‌కోర్టు ప్రాంగణంలో డిసెంబర్ 14వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని కోరుతూ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో మంగళవారం స్థానిక కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో న్యాయశాఖ ప్రతినెల లోక్ అదాలత్ నిర్వహిస్తోందన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన

కూటమి బెల్టు

జిల్లాలో విచ్చలవిడిగా బెల్టుషాపులు

- దుకాణాల ఏర్పాటులో బరితెగించిన కూటమి నేతలు
- అనుమతి లేకపోయినా వీధికో దుకాణం
- ఏకంగా రెస్టారెంట్ తరహాలో నిర్మాణాలు చేసి మద్యం విక్రయిస్తున్న వైనం
- బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 అదనం
- ఇందులో గ్రామ టీడీపీ నేతకు ప్రతి బాటిల్ పై రూ.10 కప్పం
- మద్యం అమ్మకాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు



చిన్నతురకపాలెం గ్రామపరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్వహిస్తున్న బెల్టు షాపు

సాక్షి, నరసరావుపేట: కూటమి ప్రభుత్వంలో గ్రామాలలో మంచినీరు దొరకుతుందో లేదో కానీ మద్యం మాత్రం ఏరులైపారుతోంది. ప్రతి గ్రామంలో వీధికో బెల్టుషాపు ఏర్పాటుచేసి 24/7 మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని విచ్చలవిడిగా అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారు. బెల్టుషాపుల నిర్వహిస్తే కఠిన చర్యలంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు నీటిమీద రాతలుగానే మారాయి. ఇప్పటికే మందుబాబులు గ్రామాలలో గొడవలకు దిగుతుండగా.. బెల్టుషాపులతో నిత్యం మందు దొరకడంతో భార్యల పుస్తెలతాడులను సైతం కుదువ పెట్టి తాగే పరిస్థితి రానుందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. పల్నాడు జిల్లాలో దాదాపుగా అన్ని గ్రామాలలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు.



చిలకలూరిపేట రోడ్డులోని ఓ హోటల్‌లో అనధికారికంగా మద్యం విక్రయాలు

అ'ధన'ంగా విక్రయాలు..

గ్రామాలలో నిర్వహించే బెల్టుషాపులలో క్వాటర్ బాటిల్‌కు రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా విక్రయిస్తున్నారు. ఎంఆర్‌పీకి మద్యం దుకాణాలలో కొనుగోలు చేసి పల్లెల్లో అక్రమ విక్రయాలకు తెరదీస్తున్నారు. వచ్చిన ఆదాయంలో గ్రామ టీడీపీ నేతలకు క్వార్టర్‌కు రూ.10 కప్పం కడుతున్నారు. దీంతో ఎక్సైజ్, పోలీసు అధికారులు ఎవరూ కన్నెత్తి చూడకుండా లోకల్ నాయకులు వ్యవహారాన్ని చక్కదిద్దుతున్నారు.

రెస్టారెంట్‌లను తలపించేలా...

పట్టణ శివారు కాలనీలలో బార్ అండ్ రెస్టారెంట్లను తలపించే విధంగా బెల్టుదుకాణాలు నిర్వహిస్తున్నారు. కొంత మంది అధికారపార్టీకి చెందిన నాయకులు తమ హోటళ్లు, డాబా రెస్టారెంట్లలో బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నారు. అక్కడే కూర్చొని సేవించేందుకు అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి కొనుగోలు చేసి వచ్చి ఇక్కడ అదనపు ధరకు అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు.

- నరసరావుపేట ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన డాబా, రావిపాడు రోడ్డు సమీపంలో ఉన్న హోటళ్లలలో అనధికారికంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు చంద్రబాబు నాయుడు కాలనీ, శివసంజీవయ్య, బీసీ కాలనీలలో గృహాలలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.
- నరసరావుపేట రూరల్ పరిధిలోని చినతురకపాలెం గ్రామంలో టీడీపీ నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అందులో తాత్కాలిక శిబిరాన్ని నిర్మించి మద్యం విక్రయాలు చేస్తున్నాడు.
- జొన్నలగడ్డ మెయిన్‌రోడ్డుపైన జడ్పీ ప్రభుత్వ పాఠశాల ఎదుట బెల్టుషాపు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. పుణ్యక్షేత్రం కోటప్పకొండ పరిసరప్రాంతాలలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు...



నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం బెల్టుషాపుల నిర్వహణకు అనుమతి లేదు. నిబంధనలను అతిక్రమించి మద్యం విక్రయించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఇప్పటికే గత వారం రోజులుగా 34 కేసులు నమోదుచేశాం. పదే పదే బెల్టుషాపులు నిర్వహిస్తూ పట్టుబడితే పీడీ యాక్టులు సైతం నమోదు చేయడానికి వెనుకాడం. – మణికంఠ, పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

విచ్చలవిడిగా సరఫరా...

కూటమి ప్రభుత్వం ఇటీవల కేటాయించిన ప్రైవేట్ మద్యం దుకాణాల నుంచి బెల్టుషాపులకు విచ్చలవిడిగా మద్యం బాటిళ్ల సరఫరా అవుతున్నాయి. ఇందు కోసం వైన్‌షాపుల నిర్వాహకులు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేసుకొని గ్రామాలలోని బెల్టుషాపులకు మద్యం బాటిళ్లను అందజేస్తున్నారు. ఇందుకోసం ఎంఆర్‌పీ కన్నా అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాలపై అధికారుల నియంత్రణ ఉండేది. అధికమొత్తంలో మద్యం బాటిళ్లు విక్రయించేవారు కాదు. ఒకవేళ అధిక మొత్తంలో మద్యం బాటిళ్లు కలిగి ఉన్నా కేసులు నమోదు చేసేవారు. ప్రస్తుతం టీడీపీ నాయకుల కనుసన్నల్లో మద్యం దుకాణాలు నిర్వహణ జరుగుతుండటంతో మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ కొరవడింది.

గురజాల రూరల్ ఏరియాలో మూడు మద్యం దుకాణాలకు గాను రాజకీయ కారణాలతో కేవలం ఒకటి మాత్రమే ప్రారంభించడంతో ఆయా గ్రామాలలో బెల్టుషాపు నిర్వాహకులు నిర్ణయించిన ధరే ఫైనల్ అవుతోంది.

నవోదయలో ప్రవేశాలకు గడువు పెంపు

- 9, 11 తరగతుల ఖాళీల భర్తీ
- ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో మిగిలిన ఉన్న 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశానికి గడువు తేదీ పెంపుదల చేసినట్లు చిలకలూరిపేట మండలం మద్దిరాలలో గల పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 9వ తేదీ తుది గడువు అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ 2010 మే ఒకటో తేదీ నుంచి 2012 జూలై 31 తేదీ మధ్య జన్మించిన విద్యార్థులు 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వీరికి హిందీ, ఇంగ్లీష్ గణితం, సైన్స్ సబ్జెక్టులో ఆబ్జెక్టు విధానంలో ప్రశ్నపత్రం ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉంటుందన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతూ 2008 జూన్ ఒకటో తేదీ నుంచి 2010 జూలై 31వ తేదీ మధ్య జన్మించిన విద్యార్థులు 11వ తేదీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వీరికి ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ సైన్స్, మెంటల్ ఎబిలిటీ సబ్జెక్టుల్లో ఓఎంఆర్ పద్ధతుల్లో పరీక్ష ఉంటుందన్నారు. వీరికి ఇంగ్లీషు, హిందీ భాషలో ప్రశ్నపత్రం ఉంటుందని వివరించారు. ఆయా ఖాళీల్లో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షలకు cbreitmr.nic.in/2024/nvrin, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు cbreitmr.nic.in/2024/nvx-i11 వెబ్‌సైట్లను లాగిన్ కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పట్టభద్రుడా.. పట్టదా!



సమావేశానికి హాజరైన బీఎల్వోలు

- మందకొడిగా ఓటు నమోదు దరఖాస్తులు
- సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో 11,898 దరఖాస్తులు

సత్తెనపల్లి: రానున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదుకు ఒక్క రోజే గడువు ఉంది. అయినా చాలామంది ఓటు నమోదు చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. అర్హత కలిగిన వారు ఓటు నమోదుకు ముందుకు రావాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. బీఎల్వోలతో అధికారులు సమావేశాలు నిర్వహించి ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశాలిస్తున్నారు. రాజకీయపార్టీల ముఖ్య నేతలు అవగాహన కల్పిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులకు ఓటు నమోదుకు సంబంధించిన దరఖాస్తులు అందిస్తున్నారు.

అర్హత ఉండి దూరంగా...

చాలామంది డిగ్రీలు పూర్తిచేసిన పట్టభద్రులు ఓటు నమోదుకు అవగాహన లేక ఆసక్తి కొరవడి నమోదు చేయించుకోవడం లేదు. ప్రస్తుతం నమోదుకు పలు ఇబ్బందులు ఉన్నాయని ఆరోపణలు కూడా ఉన్నాయి. దరఖాస్తుపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించాల్సి ఉంది. అధికారి దగ్గరకు వెళితే వారు సరిగ్గా స్పందించకపోవడంతో కొంత మంది వెనుతిరుగుతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేసినా పరిశీలన పేరుతో ఆయా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని పలువురు పట్టభద్రులు అంటున్నారు. ఈ తతంగం అంతా చేయలేక కొందరు పట్టభద్రులు ముందుకు రావడం లేదు.

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో 11,898 దరఖాస్తులు

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఒక పట్టణం, 9 మండలాలు ఉన్నాయి. సెప్టెంబర్ 30 నుంచి మంగళవారం వరకు సత్తెనపల్లి నియోజకవర్గంలో 6,517 దరఖాస్తులు, పెదకూరపాడు నియోజకవర్గంలో 5,381 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

నేటితో ఓటు నమోదుకు ఆఖరు..

అర్హత కలిగిన పట్టభద్రులందరూ బుధవారం సాయంత్రం లోపు ఓటు నమోదు చేసుకోవాలి. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పలుచోట్ల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. బీఎల్వోలు గతంలో ఓటు ఉన్నవారికి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. కావలసిన పత్రాలు ఇస్తే దరఖాస్తు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆన్ లైన్ ద్వారా, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు డివిజన్ పరిధిలోని పట్టభద్రులంతా ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

పట్టభద్రుల ఓటు కోసం 40,105 మంది దరఖాస్తు

నరసరావుపేట: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం నాటికి జిల్లాలో 40,105మంది ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం వెల్లడించారు. పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగుస్తుందన్నారు. కావున 2021 నవంబరు ఒకటవ తేదీ నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు తమ డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, సాధారణ ఎన్నికల ఓటరుకార్డుల జిరాక్స్ కాపీలతోపాటు పాస్‌పోర్టుసైజు ఫొటో, ఫారం –18తో కలిపి ఓటుకోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమీపంలోని తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మందుబాబులకు జైలుశిక్ష

నగరంపాలెం: మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన ఇద్దరికి ఐదు రోజులు జైలు శిక్ష విధిస్తూ ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లత మంగళవారం తీర్పు చెప్పారు. పశ్చిమ ట్రాఫిక్ పీఎస్ సీఐ సీహెచ్ సింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిని కోర్టులో హాజరుపరిచారు. వారికి ఐదు రోజులు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నాగులచవితి సందర్భంగా నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వేకువజామున భక్తులు పవిత్ర కృష్ణానదిలో కార్తిక స్నానాలు చేసి ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, ఆలయంలోని మొదటి ప్రాకారంలో జ్వాలాముఖి అమ్మవారి ఆలయం వద్ద, తూర్పు గాలిగోపురం వద్ద ఉన్న నాగేంద్రుని పుట్టలలో పాలు పోసి పూజలు నిర్వహించారు. నాగేంద్రునికి ఇష్టమైన నువ్వులపిండి, సజ్జనాను బాలు, ఆవుపాలు, అరటిపండ్లు, చలిమిడి, పదార్థాలను పుట్టలో వేసి దీపారాధనలు చేసి పూజలుచేశారు. పుట్టమట్టిని పిల్లల చెవులకు పెట్టి నాగేంద్రుని స్తోత్రాలను పఠించారు. ఆలయస్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ నాగులచవితి విశిష్టతను వివరించారు. మధ్యాహ్నం వరకు పలు గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాన్ని సందర్శించారు.

సుబ్రమణేశ్వరునికి విశేష పూజలు

అమరేశ్వరాలయంలో నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయంలోని సుబ్రమణేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామివారికి భక్తుల సమక్షంలో అర్చకులు శంకరమంచి రాజశేఖరశర్మ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము ఆలయంలోని సుబ్రమణ్యేశ్వరునికి విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దాచేపల్లి మండలం నారాయణపురంలోని నాగేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అమరేశ్వరాలయంలో నాగుల చవితికి నాగేంద్రుని పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



విశేషాలంకారంలో సుబ్రమణేశ్వరస్వామి

అర్హులందరికీ సిలిండర్లు



తెనాలి రూరల్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీ, బాలాజీరావుపేట ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన దీపం–2 పథకం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సిలిండర్లను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు ఆయన వెంట ఉన్నారు. బాలాజీరావుపేట అయ్యప్ప స్వామి గుడి సమీపంలో పంపిణీ సందర్భంగా ఆయన గ్యాస్ పొయ్యిని వెలిగించగా.. లబ్ధిదారు మల్లవరపు శివమ్మ టీ కాచి మంత్రి, జిల్లా కలెక్టర్ సహా అధికారులకు అందజేశారు. కేవైసీ అందరూ చేసుకోవాలని మంత్రి సూచించారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్‌వో కోమలి పద్మ, సీఎస్‌డీటీ మూర్తి, పాల్గొన్నారు.

పవన్ పర్యటనతో ట్రాఫిక్ ఆంక్షలు



గడియారం స్తంభం సెంటర్‌లో ట్రాఫిక్ నిలిపివేసిన దృశ్యం

ఇబ్బందులు పడిన ప్రజలు

నరసరావుపేట: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన కొద్దిసేపు స్థానిక ప్రజలను ఇబ్బందుల పాలు చేసింది. మల్లమ్మసెంటర్, గడియారం స్తంభం సెంటర్, శివునిబొమ్మ సెంటర్, పల్నాడు రోడ్లలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. వాహనదారులకు ట్రాఫిక్ బోర్డులు అడ్డుగా నిలబెట్టి ఎక్కడిక్కడ ఆపేశారు. మంగళవారం గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలంలో గల సరస్వతీ భూములను పరిశీలించేందుకు బయలుదేరిన పవన్ నరసరావుపేట పట్టణం గుండా గురజాలకు బయలుదేరి వెళ్లారు. ఆయన రాకను పురస్కరించుకొని స్వాగతం చెప్పేందుకు జనసేన వర్గీయులు పలు సెంటర్లకు భారీగా చేరుకున్నారు. ఎస్ఆర్‌కేటీ జంక్షన్‌తోపాటు పలు సెంటర్లలో భారీగా గుమికూడిన అభిమానులకు కారు నుంచి బయటకు వచ్చి అభివాదం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని మల్లమ్మసెంటర్‌లో కార్యకర్తల తోపులాట మధ్య పుష్పగుచ్ఛం అందజేయటంతో ఆయనతో పవన్ కరచాలనం చేశారు. పవన్ కాన్వాయ్ పట్టణం దాటడంతో ట్రాఫిక్ ఆంక్షలను సడలించి ప్రజలను రాకపోకలకు అనుమతి ఇచ్చారు. పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

క్లుప్తంగా

ఏఎంరెడ్డి కళాశాలలో వాలీబాల్ పోటీలు



నరసరావుపేటరూరల్: పెట్లూరివారిపాలెం లోని ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో మంగళవారం అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి ఏడు కళాశాలల జట్లు పోటీలో పాల్గొన్నాయి. పోటీలను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన పోటీలలో ఇండో అమెరికన్ ఫార్మసీ కళాశాల(జొన్నలగడ్డ) విన్నర్‌గా, విక్టోరియా కళాశాల(పేరేచర్ల) జట్లు రన్నర్‌గా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు నగదు బహుమతి, ట్రోఫీలు అందజేశారు. శాంతి మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. ప్రతి ఏడాది ఇటువంటి క్రీడా పోటీలను కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ పి.భార్గవ్‌భూషణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జీబీసీ కాల్వలో గుర్తు తెలియని మృతదేహం



ముప్పాళ్ల: మండలంలోని గుంటూరు బ్రాంచి కాలువలోని లాకుల వద్ద గుర్తు తెలియని మృతదేహం మంగళవారం గుర్తించారు. మృతుడికి సుమారు 60 ఏళ్ల పైబడి ఉంటాయని, కాల్వలో పడి సుమారు నాలుగు రోజుల పైబడి ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. బోర్లా ఉండటంతో గుర్తుపట్టడానికి వీలు లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరి జేసీబీతో మృతదేహాన్ని బయటకు తీశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల నుంచి వైద్యుడిని పిలిపించి అక్కడే శవపంచనామా నిర్వహించి, సమీపంలోనే పూడ్చి వేశారు. మృతదేహంపై దుస్తులు లేవని, కుడి చేతికి మాత్రం రాగి కడియం ఉందని ఎస్సై యు.సోమేశ్వరరావు తెలిపారు.

అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం



స్విమ్మింగ్ పోటీలో తలపడుతున్న వివిధ జిల్లాల క్రీడాకారులు



బటర్‌ఫ్లై విభాగంలో తలపడుతున్న క్రీడాకారులు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు మంగళవారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్ ప్రారంభమయ్యాయి. పోటీలను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, పోటీల పరిశీలకుడు బంగార్రాజు (తూర్పుగోదావరి), స్విమ్మింగ్ కోచ్ జి.సురేష్ ప్రారంభించారు. పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 650 మంది క్రీడాకారులు, దాదాపు 125 మంది టీమ్ మేనేజర్లు, సిబ్బంది హాజరయ్యారు. ఆయా జిల్లాల క్రీడాకారులు ఫ్రీస్టైల్, బటర్‌ఫ్లై, బ్యాక్‌స్ట్రోక్ తదితర విభాగాలలో పోటీ పడనున్నారు. అంతర్ జిల్లాల పోటీలతోపాటు ఆయా విభాగాలలో జాతీయస్థాయి పోటీలలో పాల్గొనున్న రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నట్టు స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు.

చీడపీడల నియంత్రణకు ఎన్‌పీఎస్‌ఎస్ యాప్

సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి వీరయ్య చౌదరి



మాట్లాడుతున్న సస్యరక్షణ కేంద్రం అధికారి

నరసరావుపేటరూరల్: పంటల్లో చీడపీడలను త్వరగా గుర్తించి సత్వర సలహాలు, సూచనలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నేషనల్ ఫెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్‌ఎస్) యాప్ దోహదపడుతుందని విజయవాడ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి కె.వీరయ్యచౌదరి తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో కేంద్ర సస్యరక్షణ ఆధ్వర్యంలో జాతీయ చీడపీడల పరిరక్షణ వ్యవస్థ, కేంద్ర వ్యవసాయ శాఖ పంటలలో చీడపీడల నియంత్రణకు రూపొందించిన ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, శాస్త్రీయ రైతులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. సస్యరక్షణ కేంద్రం అధికారి వీరయ్య చౌదరి మాట్లాడుతూ రైతులు ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌ను ఉపయోగించి సలహాలు, సూచనలు పొందవచ్చని అన్నారు. పంట పొలంలోని చీడపీడల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే పురుగు, తెగులును త్వరితగతిన గుర్తించడమే కాకుండా సస్యరక్షణ చర్యలను సూచిస్తుందని తెలిపారు. రైతులు సాగు చేసే ప్రధానమైన 15రకాల పంటల్లో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమాచారం అందించగానే చీడపీడల నివారణ చర్యలను ఈ యాప్ సిఫార్స్ చేస్తుందని వివరించారు. ఈ యాప్ ద్వారా తెగులు, కీటకం హానికరం లేదా ప్రయోజనకరమైందో తెలుసుకోవచ్చని చెప్పారు. దీంతోపాటు క్రిమిసంహారక మందుల్ని ఏ పరిమాణంలో ఏ సమయంలో ఎంత ఇవ్వాలో యాప్ సూచిస్తుందని తెలియజేశారు. క్రిమిసంహారకాల కంటే ముందుగా సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను ప్రోత్సహించే విధంగా యాప్ సిఫార్సులు ఉంటాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటల్లో పురుగులు, తెగుళ్ల సమగ్ర వీక్షణ, విశ్లేషణ యాప్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. గ్రామం నుంచి కేంద్ర స్థాయి వరకు మొక్కల సంరక్షణ యంత్రాగాన్ని రైతులకు ఉపయోగపడే విధంగా అందుబాటులో ఉంచడమే ఈ యాప్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కృత్రిమ మేధా, యంత్ర అభ్యాసం వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ యాప్ పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సస్యరక్షణ సహాయ అధికారి సురేష్, ఎన్‌పీఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం.శివకుమారి పాల్గొన్నారు.

బకాయిలు లేకుండా వసూళ్లు చేయాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ పి.విజయ్‌కుమార్



రికార్డులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్

పిడుగురాళ్ల: విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ బకాయిలు లేకుండా అధికారులు విధులు నిర్వహించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణ సమీపంలోని కొండమోడు విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ఎస్ఈ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సబ్ డివిజన్ పరిధిలోని రికార్డులు పరిశీలించారు. 33/12 కేవీ కొండమోడు సబ్‌స్టేషన్ పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలని, విద్యుత్ బకాయిలు లేకుండా వసూళ్లు చేయాలన్నారు. మొండి బకాయిలపై దృష్టి పెట్టి వసూళ్లు చేయించాలని సూచించారు. సోలార్ పీఎం సూర్య గర్‌పై సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట మాచర్ల డివిజన్ మోడల్ ఆఫీసర్ సింగయ్య, సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్‌బాల్ అండర్-14 బాలుర రాష్ట్ర జట్టు క్రీడాకారులు

- అండర్-14 విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ స్థానం
- అండర్-14 బాల బాలికల రాష్ట్ర జట్లు ఎంపిక


నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్-14 బాలబాలికల బాస్కెట్ బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ స్థానం సాధించగా, కృష్ణా, విశాఖ జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ, అనంతపురం ద్వితీయ, కృష్ణా జిల్లా తృతీయ స్థానాలు సాధించాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొనే అండర్-14 బాలబాలికల రాష్ట్ర జట్టును సోమవారం రాత్రి స్కూల్ గేమ్స్ పల్నాడుజిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. మూడురోజులుగా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్ జిల్లాల అండర్-14 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలలో భాగంగా రాష్ట్ర జట్లు ఎంపిక నిర్వహించారు.

అండర్-14 బాలుర విభాగంలో వి.శుశ్రిత్, ఎస్.శ్రీచరణ్, కె.త్రిశాల్ (తూర్పుగోదావరి), ఈ.కౌషిక్, ఎం.సంతోష్ (అనంతపురం), ఈ.చార్లెస్‌వెస్లీ (పశ్చిమ గోదావరి), జి.జగదీష్, వి.కేతన్‌సాయి (కృష్ణా), కె.జైరామ్ (విశాఖ), పి.జీవన్ (కర్నూల్), కె.సాయిసంతోష్ (చిత్తూరు), కె.కార్తికేయ (నెల్లూరు).

అండర్-14 బాలికల విభాగంలో సిహెచ్.ఐశ్వార్యాంబిక, బిఎస్ఆర్ మాధురి, సిహెచ్.భువనేశ్వరీ (తూర్పుగోదావరి), బి.కుసుమ, ఆర్.వాహిని (కృష్ణా), జి.శాస్య, కె.అమూక్త (విశాఖ), యోగశ్రీ (పశ్చిమగోదావరి), ఎస్.సాయిశ్రీ (గుంటూరు), రిషిత (చిత్తూరు), శ్రీజా (అనంతపురం), ఎస్.ముస్కన్ (కర్నూలు).

ఉత్తమ లేఖలకు బహుమతులు

- తపాలా శాఖ ఆధ్వర్యంలో లేఖ రచన పోటీలు
- డిసెంబర్ 14 వరకూ గడువు



బెల్లంకొండ: ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్న వారి క్షేమం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు కలం తీసుకొని లేఖలు రాసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఒకప్పటి సమాచార సాధనాన్ని నేటి తరానికి తెలియజేయడానికి 'డిజిటల్ యుగంలో లేఖ రచన ఆవశ్యకత' అనే అంశంపై లేఖల పోటీలకు తపాలా శాఖ ఆహ్వానం పలుకుతుంది.

ఈ పోటీలకు 18 ఏళ్ల లోపు ఒక కేటగిరి, 18 ఏళ్లు పైబడిన వారిని మరో కేటగిరీగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్ తదితర అంశాలను పొందుపరచాలి. చేతితో రాసిన వ్యాసం మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలాప్ కవర్ అయితే వెయ్యి పదాలు మించరాదు. ఇన్‌లాండ్ లెటర్ అయితే 500 పదాలు మించకుండా రాయల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలు ది పోస్టల్ సూపరింటెండెంట్, ప్రధాన తపాలా కార్యాలయం, నరసరావుపేట చిరునామాకు డిసెంబర్ 14వ తేదీ లోపు పంపాలి.

రాష్ట్ర, జాతీయ స్థాయిలలో బహుమతులు..

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతి అందజేస్తారు. సర్కిల్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా రూ.25వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారిని జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం రూ.50వేలు, ద్వితీయ స్థానం రూ.25వేలు, తృతీయ స్థానం విజేతకు రూ.10వేలు అందజేయనున్నారు.

అపార్ నమోదులో సమస్యలను పరిష్కరించాలి

డీఈవో రేణుకకు అప్సా విజ్ఞప్తి



డీఈవో రేణుకకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవీంద్రబాబు, శ్రీహరి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అపార్ నమోదులో సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (అప్సా) రాష్ట్ర కో-కన్వీనర్ మేకల రవీంద్రబాబు, కోశాధికారి చెరుకూరి శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవీ రేణుకను అప్సా ప్రతినిధులు కలిశారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అప్సా ప్రతినిధులు మాట్లాడుతూ.. అపార్ కోసం విద్యార్థుల వివరాల నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. యూడైజ్ ప్లస్, ఆధార్‌లోని వివరాలు సరిపోలకపోవడంతో నమోదు కావడం లేదని పేర్కొన్నారు. ఆధార్‌లో తప్పుల సవరణకు విద్యార్థులు ఆయా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని డీఈవోకు వివరించారు. అపార్ అప్‌లోడింగ్‌కు గడువు పెంచాలని కోరారు. పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఆదివారాల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డీఈవో రేణుక స్పందిస్తూ.. ఆధార్ సవరణల కోసం గుంటూరు నగరంలో అదనపు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. డీఈవోను కలిసిన వారిలో అప్సా రాష్ట్ర నాయకులు వంగా శ్రీనివాసరావు, ఏవీ సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు మురళీమోహనరావు, డివిజన్ అధ్యక్షులు నర్రా రాజేష్, భాను ప్రసాద్, నాయకులు మాదా శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, శివనాగేశ్వరరావు, పాశం శ్రీనివాసరావు ఉన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు



పంటలను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి, సభ్యులు

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని న్యూ చిట్యాల, నాగిరెడ్డిపాలెం గ్రామాలలో కంది, మిర్చి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రన్‌తో కలసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ కందిలో అంతర పంటలుగా గోరు చిక్కుడు, సజ్జ, దోస, అలసంద, పెసర పంటలు, రక్షక పంటగా జొన్న వేయడం జరిగిందన్నారు. ఈ విధానం వలన కంది పంటను ఆశించే పురుగు తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. అంతర పంటల ద్వారా ఇప్పటివరకు రూ.3వేలు ఆదాయం వచ్చిందని రైతులు తెలిపారు. భూమి పంటలతో కప్పించడం ద్వారా కలుపు నివారణ సాధ్యమవుతుందని, అన్ని రకాల పంటలు వేయడంతో భూమి సారవంతమవుతుందని తెలిపారు. కంది పంట వేసే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా నికర ఆదాయం పెరుగుతుందని అంతర పంటల ద్వారా ప్రధాన పంటకు అయ్యే ఖర్చు తగ్గించవచ్చని అన్నారు. మిర్చిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో అంతర పంటలుగా ముల్లంగి, బంతి, కొత్తిమీర వేయడం ద్వారా ప్రధానంగా ఈ పంటల నుండి వచ్చే ఘాటైన వాసనకు మిరపలో వచ్చే తామర పురుగు ఉధృతి తగ్గుతుందని, రైతుకి అదనపు ఆదాయం చేయకూరుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య, సిబ్బంది సైదయ్య, నందకుమార్, అనంతలక్ష్మి, అంజలి, నరసింహారావు, మాధవి, రైతులు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా ఆనందరావు




పొన్నూరు: మండలంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన న్యాయవాది తాడిశెట్టి వెంకట ఆనందరావు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హైకోర్టు సెక్షన్ అధికారి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గుంటూరులో ఆయన న్యాయ విద్య అభ్యసించి, ప్రాక్టీస్ నిర్వహించారు. ఆయన నియామకం పట్ల పొన్నూరు న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బీసీ సంక్షేమ అధికారి శివనాగేశ్వరరావు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఆధ్వర్యంలో డీఎస్సీ-2024 ఎస్‌జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి బి.శివనాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 11వ తేదీలోగా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 200 మంది అభ్యర్థులకు 2నెలల పాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందిస్తామని వివరించారు. ఏపీ టెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులను టీటీసీ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10వ తరగతి, టీటీసీ, టెట్ మార్కుల లిస్టులు, కుల, ఆదాయ (రూ.ఒక లక్ష లోపు), ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, రెండు ఫొటోలు జత పరచాలన్నారు. వివరాలకు 9010497267 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

టోల్ గేట్ వద్ద ఇద్దరు పిల్లల గుర్తింపు




మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద ఒంటరిగా తిరుగుతున్న ఇద్దరు పిల్లలను రూరల్ పోలీసులు స్టేషనుకు తరలించారు. ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాలు మేరకు .. మంగళవారం టోల్‌గేట్ వద్ద ఒంటరిగా తిరుగుతున్న ఇద్దరు పిల్లలను గమనించిన స్థానికులు తమకు సమాచారమిచ్చారన్నారు. బాలిక (10) పేరు షేక్ ఆఫియా అని, బాలుడు (7) పేరు షేక్ సలీం అని దర్యాప్తులో తేలింది. వారి తల్లిదండ్రులు షేక్ సలీం, జయ అని బాలలు చెబుతున్నారు. విజయవాడ చిట్టినగర్, గుంటూరు అని వేర్వేరుగా చెబుతుండడంతో స్టేషన్‌కు తరలించారు. వారి వివరాలు తెలిసిన వారుగానీ, తల్లిదండ్రులుగానీ సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

పోలీసులతో కలిసి టీడీపీ నేతలు ఇబ్బందులు పెడుతున్నారు

డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

భట్టిప్రోలు: టీడీపీ నాయకులు పోలీసులతో కలసి తమను హతమార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి శ్రీనివాసరావు, మోర్ల కోటేశ్వరరావులు మంగళవారం తాడేపల్లిలోని డీజీపీ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తమను పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, ఎస్ఐ శివయ్యతో సోమవారం రాత్రి సుదీర్ఘ మంతనాలు జరిపినట్లు బాధితులు ఆరోపించారు. అధికార పార్టీకి కొమ్ము కాస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్న పోలీస్ అధికారులు, టీడీపీ నాయకులు తూనుగుంట్ల సాయి బాబా నుంచి తమకు తగు రక్షణ కల్పించాలని బాధితులు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



ఐలవరం(భట్టిప్రోలు): ఈనెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నెల్లూరు జిల్లా దర్గామిట్టా జెడ్పీ బాలికల హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఏ యోగా పోటీలలో భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుచున్న కె.సంపత్ సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. డిసెంబర్ 8 నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సంపత్‌ను, పీడీ శ్రీనివాసరెడ్డిని హెచ్ఎం అభినందించారు.

ఏఎన్‌యూ అధ్యాపకుడి పరిశోధనకు పేటెంట్



ఆచార్య పీవీ కృష్ణకు పేటెంట్ పత్రాలను అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: గోదావరిలో లభించే పొలస చేపలలో ఉండే పోషక పదార్థాలపై చేసిన పరిశోధనకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జువాలజీ అధ్యాపకుడు ఆచార్య పీవీ కృష్ణకు పేటెంట్ లభించింది. ఈ మేరకు చెన్నైలోని భారత ప్రభుత్వ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పేటెంట్ కార్యాలయం నుంచి పత్రం ఆయనకు అందింది. వర్సిటీలో మంగళవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు నుంచి ఆ పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ పేటెంట్ రావడం గర్వకారణమన్నారు. ఆచార్య పీవీ కృష్ణ మాట్లాడుతూ.. పులస చేపలలో ప్రోటీన్లు, సాచ్యూరేటెడ్, అన్‌సాచ్యూరేటెడ్ ఆమ్లాలలో అతి ముఖ్యమైన డోకోసహెక్సయినోయిక్ (డీహెచ్ఏ), ఐకోసపెంటయినోయిక్ (ఈపీఏ) ఆమ్లాల మీద పరిశోధన చేశానన్నారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, జియాలజీ విభాగాధిపతి ఆచార్య పీజే రత్నాకర్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు తదితరులు ఆయన్ను అభినందించారు.

మార్చి ఆఖరులోగా ఇళ్లు కట్టకపోతే బిల్లులు రావు



ప్రత్తిపాడు హౌసింగ్ లే అవుట్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న పీడీ ప్రసాద్, ఈఈ శంకరరావు

ప్రత్తిపాడు: ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించిన లబ్ధిదారులు మార్చి నెలాఖరులోగా పూర్తి చేయకుంటే వాటికి సంబంధించి బిల్లులు రావని గృహనిర్మాణ శాఖ పీడీ జె.వి.ఎస్.ఆర్.కె.వి. ప్రసాద్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మంగళవారం పీడీ పర్యటించారు. స్థానిక హౌసింగ్ లే అవుట్‌లోని ఇళ్లను మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంతమందికి పట్టాలిచ్చారు, ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి, ఏ దశల్లో ఎన్ని ఉన్నాయి..? వంటి వివరాలను హౌసింగ్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థిక పరిస్థితి సహకరించని వారికి వెలుగు ద్వారా అధిక రుణాలు మంజూరు చేయించాలని ఎంపీడీవో శివపార్వతి, వెలుగు అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రోజుకో మండలంలో పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు క్రయ, విక్రయాలు చెయ్యడానికి వీల్లేదని పీడీ స్పష్టం చేశారు. వెంట ఎంపీడీవో కె. శివపార్వతి, హౌసింగ్ ఈఈ ఎ. శంకరరావు, డీఈ సత్యనారాయణ, ఏఈ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.